# రోమీయులకు వ్రాసిన పత్రిక 16వ అధ్యాయము

**వ్యక్తిగత శుభములు**

కెంక్రేయలో నున్న సంఘ పరిచారకురాలగు ఫీబే అను మన సహోదరిని, పరిశుద్ధులకు తగినట్టుగా
ప్రభువునందు చేర్చుకొని, 2 ఆమెకు మీ వలన కావలసినది ఏదైనా ఉన్న యెడల సహాయము చేయవలెనని
ఆమెను గూర్చి మీకు సిఫారసు చేయుచున్నాను ఆమె అనేకులకును, నాకును సహాయురాలై యుండెను. 3
క్రీస్తు యేసు నందు నా జతపని వారైన ప్రిస్కిల్లకును, అకులకును నా వందనములు చెప్పుడు 4 వారు నా
ప్రాణము కొరకు వారి ప్రాణములను ఇచ్చుటకైనను తెగించిరి. మరియు, వారి ఇంట నున్న సంఘమునకును
వందనములు చెప్పుడు నేను మాత్రము కాదు, అన్యజనులలోని సంఘములవారందరు వీరికి
కృతజ్ఞులైయున్నారు. 5 ఆసియలోని క్రీస్తుకు ప్రథమ ఫలమైయున్న నా ప్రియుడగు ఎపైనెటుకు వందనములు.
6 మీ కొరకు బహుగా ప్రయాసపడిన మరియకు వందనములు. 7 నాకు బంధువులును, నా తోడి ఖైదీలునైన
అంద్రొనీకుకును, యూనీయకును వందనములు, వీరు అపొస్తలులలో ప్రసిద్ధికెక్కిన వారై, నాకంటె ముందుగా
క్రీస్తునందున్నవారు. 8 ప్రభువునందు నాకు ప్రియుడగు అంప్లీయతునకు వందనములు. 9 క్రీస్తునందు మన
జత పనివాడగు ఊర్బానుకును, నా ప్రియుడగు స్టాకునకును వందనములు. 10 క్రీస్తునందు యోగ్యుడైన
అపెల్లెకు వందనములు. అరిస్టొబూలు ఇంటి వారికి వందనములు. 11 నా బంధువుడగు హెరోదియోనుకు
వందనములు. నార్కిస్సు యింటివారిలో ప్రభువునందున్న వారికి వందనములు. 12 ప్రభువునందు
ప్రయాసపడు త్రుపైనాకును త్రుఫోసాకును వందనములు. ప్రియురాలగు పెర్సిసుకు వందనములు, ఆమె
ప్రభువునందు బహుగా ప్రయాసపడెను. 13 ప్రభువునందు ఏర్పరచబడిన రూపునకు వందనములు అతని
తల్లికి వందనములు, ఆమె నాకును తల్లి. 14 అసుంక్రితుకును, ఫ్లెగోనుకును, హెర్మేకును పత్రోబకును,
హెర్మాకును వారితో కూడానున్న సహోదరులకును వందనములు. 15 పిలొలొగునకును, యూలియాకును,
నేరియకును, అతని సహోదరికిని, ఒలుంపాకును వారితో కూడనున్న పరిశుద్ధులందరికిని వందనములు. 16
పవిత్రమైన ముద్దు పెట్టుకొని యొకని కొకడు వందనములు చేయుడు క్రీస్తు సంఘములన్నియు మీకు
వందనములు చెప్పుచున్నవి.

17 సహోదరులారా, మీరు నేర్చుకొనిన బోధకు వ్యతిరేకముగా భేదములను, ఆటంకములను
కలుగజేయు వారిని కనిపెట్టి యుండుడని మిమ్మును బతిమాలు కొనుచున్నాను. వారిలో నుండి తొలగిపోవుడు
18 అట్టివారు మన ప్రభువైన క్రీస్తుకు కాక తమ కడుపునకే దాసులు, వారి యింపైన మాటల వలన
ఇచ్చకముల వలన నిష్కపటుల మనస్సులను మోసపుచ్చుదురు. 19 మీ విధేయత అందరికిని ప్రచురమైనది
గనుక, మిమ్మును గూర్చి సంతోషించు చున్నాను. మీరు మేలు విషయమై జ్ఞానులును, కీడు విషయమై
నిష్కపటులునై యుండవలెనని కోరుచున్నాను. 20 సమాధానకర్తయగు దేవుడు సాతానును మీ కాళ్ళ క్రింద
శీఘ్రముగా చితుక త్రొక్కించును. మన ప్రభువైన యేసుక్రీస్తు కృప మీకు తోడైయుండును గాక.

21 నా జతపనివాడగు తిమోతి నా బంధువులగు లూకియ యాసోను సోసిపత్రు
అనువారును మీకు వందనములు చెప్పుచున్నారు. 22 ఈ పత్రిక వ్రాసిన తెర్తియు అను నేను ప్రభువునందు
మీకు వందనములు చేయు చున్నాను. 23 నాకును యావత్సంఘము నకును అతిథ్యమిచ్చు గాయియు మీకు

వందనములు చెప్పుచున్నాడు. ఈ పట్టణపు ఖజానా దారుడగు ఎరస్తును, సహోదరుడగు క్వర్తును మీకు వందనములు చెప్పుచున్నారు. 24 మన ప్రభువైన యేసుక్రీస్తు కృప మీకు తోడై యుండును గాక.

**దైవ స్తుతి**

25 సమస్తమైన అన్యజనులు విశ్వాసమునకు విధేయులగునట్లు, అనాదినుండి రహస్యముగా ఉంచబడి యిప్పుడు ప్రత్యక్ష పరచబడిన మర్మము, నిత్యదేవుని ఆజ్ఞప్రకారము ప్రవక్తల లేఖనముల ద్వారా వారికి తెలుపబడియున్నది. 26 ఈ మర్మమునననుసరించి యున్న నా సువార్తప్రకారముగాను, యేసుక్రీస్తును గూర్చిన ప్రకటన ప్రకారముగాను, 27 మిమ్మును స్థిరపరచుటకు శక్తిమంతుడును, అద్వితీయ జ్ఞానవంతుడైన దేవునికి యేసుక్రీస్తు ద్వారా నిరంతరము మహిమ కలుగును గాక. ఆమేన్.